




గొల్లపూడి మారుతి రావు గారు తరచూ లండన్ వెళుతుంటారు. అక్కడ ప్రదర్శితమయ్యే స్టేజి నాటకాలు చూడడం అయనకి హాబీ. అలా ఆయన వీక్షించిన నాటకాల్లో ఒక ఐదు ప్రసిద్ధమైన నాటకాలని ఎంపిక చేసి వాటి గురించి, ప్రతి నెలా ఒక నాటకాన్ని 'కౌముది' పాఠకులకి పరిచయం చేస్తున్నారు. అరుదైన ఈ అనుభవాల వివరాలు మీ అందరికీ ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

**ఎప్పుడు** ఏ కారణానికి ఇంగ్లండ్ వెళ్ళాలన్నా - నన్ను ఆకర్షించేది, తన వేపు తిప్పుకునేదీ ఇంగ్లండ్ నాటక రంగమే. సెంట్రల్ లండన్‌లో పికడిల్లీ స్టేషన్‌లోంచి (అండర్ గ్రౌండ్) బయటకి రాగానే ఎదురుగా కనిపించే వీధి పేరు హేమార్కెట్. దాని కింద గర్వంగా ఇంగ్లీషువారు వ్రాసుకున్న ఓ మాట ఉంది. "హేమార్కెట్ వీధి: థియేటర్ లాండ్" అని. ఇది నాటక ప్రపంచం అని చెప్పుకోవడం వారికి గర్వకారణం.

విజయవాడ గవర్నరు పేటలోనో, మద్రాసు మూర్ మార్కెట్‌లోనో, విశాఖపట్నం జగదాంబా సెంటర్‌లోనో వ్యాపారం లాగ ఈ ప్రాంతంలో ఎన్నో ఎన్నో దుకాణాలు విరివిగా, అను నిత్యం అమ్మే సరుకు ఒకటుంది - నాటకం టిక్కెట్లు. సంవత్సరం పొడుగునా ఆ దుకాణాల ముందు క్యూలుంటాయి. ఆ క్యూలలో థాయ్‌లాండ్ వారూ, కొరియా వారూ, జపాన్ వారూ, మారిషస్ వారూ, మారుతీరావులూ కోకొల్లలుగా ఉంటారు. కనీసపు టిక్కెట్లు 800 రూపాయలనుంచీ 5,000 రూపాయలదాకా ఉంటాయి. కానీ ఎవరూ డబ్బు గురించి ఆలోచిస్తున్నట్టు కనిపించరు. కాగా చేతికి టిక్కెట్టు వచ్చినందుకే ఆనందించి తరలిపోతుంటారు. కొత్త నాటకాలూ, గొప్ప నాటకాలూ సరేసరి - దాదాపు అన్ని నాటకాలకీ - ప్రదర్శన రోజున ఏమయినా సీట్లు మిగిలిపోతే సగం రేట్లకి అమ్మే దుకాణాలున్నాయి. ఆయా నాటకాల సగం ధరలు ప్రదర్శిస్తూ బయట బోర్డులుంటాయి. చెకోవ్ 'సీగల్', షేక్స్పియర్ 'మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్', పోర్గీ అండ్ బెస్ సంగీత నాటకం, పీటర్ షాఫర్ 'ఈక్వస్' - ఇలా నాటకాల పేర్లు చదువుతుంటే - దాదాపు 550 సంవత్సరాల నాటక రంగం ఇక్కడ - ఇంకా 2007లో ప్రేక్షకుల ఆదరణ పొందుతున్నందుకు ఒక పక్క దిగ్భ్రమ మరొక ప్రక్క ఆనందమూ కలుగుతుంది. సరైన కృషితో, దక్షతతో పూనుకుంటే మనదేశంలో ఒక మృచ్ఛకటికం, ముద్రారాక్షసం, అభిజ్ఞాన శాకుంతలం, ప్రతాప రుద్రీయం, చాణుక్య - చంద్రగుప్త ప్రదర్శించడం అసాధ్యం కాదు అనిపిస్తుంది.

ఇది ఇంగ్లండులో చలికాలం. మామూలు చలి కాదు. పేగులు కొరికే చలి. హీత్రో ఎయిర్ పోర్టులోంచి బయటికి రాగానే - రాత్రి ఏడున్నరకి - సరిగ్గా ఒక డిగ్రీ ఉష్ణోగ్రత అనే వీలులేదు. బహుశా హిమోగ్రత అనాలేమో. నా జీవితంలో మంచు వర్షాన్ని ఆ అయిదురోజుల్లో చూశాను. వేల్స్, బర్మింగ్‌హాం ప్రాంతాల్లో పది అంగుళాల దళసరిన మంచు కురిసిందట. లండన్‌లో నాలుగయిదు

అంగుళాల మంచు. ఆ కథ ముందు చెపుతాను.

సాయంకాలం ఏడున్నరకి నాటక ప్రదర్శన మొదలయి రాత్రి పదిన్నర దాకా సాగుతుంది. అంటే రోజులో చల్లదనం భయంకరమయిన స్థాయికి వచ్చేవేళకి థియేటర్లోంచి బయటకు వస్తారు ప్రేక్షకులు. ఈ కారణంగా నాటక శాలలు ఖాళీగా ఉంటాయా? మనదేశంలో నాటకశాలలకి ప్రేక్షకులు రాకపోవడానికి కారణాలు వెదుకుతాం. ఏవో సాకులు వెదుక్కుని సరిపెట్టుకుంటాం. పేవ్‌మెంట్ మీద కాలు పెడితే మంచు పొరలో జారిపోయే - 4 డిగ్రీల చలి ఆవరించుకున్న రోజున - ఆ రాత్రి నాటకశాల ప్రేక్షకులతో క్రిక్కిరిసి పోయింది! ఇది ఆ నాటక రంగానికీ, ఆ నాటకాలకీ, ఆ నటులకీ, ఆ ప్రయోక్తలకి - అన్నిటికీ మించి ప్రేక్షకులకి నివాళి!

ఈసారి నేను చూసినవి అయిదు నాటకాలు. ఏదో కారణానికి వెనక 'చరిత్ర' ఉన్న నాటకాలు. ఈ అయిదూ - పేరు వినగానే గతాన్ని గుర్తు చేసే రచనలు. అయితే ఒకదానికొకటి పొంతనలేని విలక్షణమయిన కళాఖండాలు - వేర్వేరు కారణాలకి.

ప్రేక్షకుడు చూసే చూపు నాటకాన్ని ఆకర్షింప చేస్తుంది. దానికి కారణం నటుల నటనా, రచయిత రచనా, ప్రయోక్త నేర్పా, లైటింగు ప్రత్యేకతా, ప్రక్రియలో కొత్తదనమా - ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు - అయిదు రకాల నాటకాలలో ఆయా పాళ్ళలో ఆయా ప్రత్యేకగ్తలు ద్యోతకమవడం నేను గమనించాను.

లండన్ వచ్చేవారు లండన్ బ్రిడ్జిని, థేమ్స్ నదినీ, బిగ్‌బెన్‌నీ, వెస్టుమినిస్టర్ అబ్బీని, బకింగ్‌హోమ్ పాలెస్‌నీ, వింబుల్డన్‌నీ మాత్రమే కాక వెస్టెండ్ నాటకం చూడడానికి వస్తారని గ్రహించడానికి పెద్ద ప్రయత్నం అక్కర్లేదు. ఓ మంచి ఉదాహరణ - నేనే. ఇది ఆరోసారి లండన్ వెళ్ళడం. అయిదుసార్లూ తప్పనిసరిగా నాటక ప్రపంచం కోసమే వెళ్ళాను. ప్రతిసారీ నాలాంటి అభిమానులు తారసపడుతుంటారు. ఆ అభిమానుల జాబితా విచిత్రంగానూ, విలక్షణంగానూ ఉంటుంసి. ఇదివరకు ఈ వ్యాసాలలోనే పేర్కొన్నాను. నాటక రంగం బతికి బట్ట కడుతుంది. వండిన పదార్థాన్ని వంట తిన్నప్పుడు కాదు దాని రాణింపు. పదార్థం వివరం తెలియక పోయినా అది తినాలని ఆతృత చూపే 'రసన' దానికి పోషణ.

<u>ఇప్పుడు నాటకాల గురించి:</u>

## ది థర్టీ నైన్ స్టెప్స్

### ( ముప్పై తొమ్మిది మెట్లు)




ఈ పేరుతో నవల రాసిన రచయిత జాన్ బచన్ - పాత్రికేయుడు, రాజకీయ నాయకుడు, దౌత్య ఉద్యోగి, ఒక ప్రచురణ సంస్థ డైరెక్టరు, న్యాయవాది. కెనడా గవర్నరు జనరలుగా పనిచేశారు. ఆయన తన 39 వ ఏట పెద్ద పేగుకి సంబంధించిన (డియోడినల్) వ్యాధితో మంచమెక్కారు. తప్పనిసరిగా విశ్రాంతిగా మంచం మీద ఉండాల్సిన పరిస్థితి. ఏం చెయ్యాలో ఊసుపోక ఓ నవల వ్రాయడం ప్రారంభించారు. ఆ నవలే ఈ 39 మెట్లు. తన వయస్సు 39వ ఏటకి ఈ నవలలో 39 మెట్లకీ ఏమయినా సంబంధం ఉందా? ఏమో! రచయిత మనస్సు విచిత్రమయిన ముడులు వేస్తుంది. ఇతమిద్ధమని కారణం చెప్పలేకపోయినా 39 అంకె ఆ విధంగానే పుట్టి ఉండవచ్చు.

ఈ నవలలో కథ మాట అలా ఉండగా - ఈ నవలని ఆధారం చేసుకుని తీసిన సినిమాలకి వేరే కథ ఉంది. హాలీవుడ్ చరిత్రలో ఈ "39 మెట్లు" కథని మూడుసార్లు సినిమాగా తీశారు. 1953 లో ప్రముఖ దర్శకులు ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ సినిమాగా తీశారు. మళ్ళీ

1959లో మరొకరు తీశారు. 1978లో మూడోసారి. విచిత్రం ఏమిటంటే మొదటి రెండు సినిమా కథలూ నవలని ఆధారం చేసుకుని తీసినవే కాని నవలతో ఎక్కువ పొంతనలేనివి. 1978 చిత్రం మాత్రం ఎంతో కొంత నవలకి దగ్గరగా వస్తుంది. మొదటి సినిమా హిచ్‌కాక్ తీసినప్పుడు జాన్ బచన్ దర్శకునితో గొడవ పెట్టుకుందామనుకున్నాడంట. కారణం, నవలకి చాలా భిన్నంగా సినిమాని రూపొందించడమే. అయితే 1953లో తీసిన సినిమాయే ఈ మూడింటిలో గొప్పదీ, పాపులర్ కూడా. ఇప్పటి నాటకం కూడా ఆ సినిమాని ఆధారం చేసుకున్నదేనని పెద్ద అక్షరాలతో హిచ్‌కాక్ పాపులారిటీని వాడుకున్నారు - నాటక ప్రదర్శకులు. అసలు నేను కానీ - మరెవరయినా కానీ -39 మెట్లు నాటకం చూడాలనుకోడానికి స్ఫూర్తి ఆల్ఫ్రెడ్ హిచ్‌కాకే. నేను 1978 సినిమా చూశాను. క్లైమాక్స్‌లో హీరో బిగ్‌బెన్ ముల్లుని పట్టుకుని వేలాడడం - తద్వారా ప్రపంచాన్ని పెద్ద ఉపద్రవం నుంచి కాపాడడం వంటిది ఆ కితాబునిచ్చింది: "సస్పెన్స్ థ్రిల్లర్ ఎలా తీయకూడదో తెలుసుకోవాలంటే ఆ సినిమా చూడాలి" అని. అదొక్కటి చాలు దాని నిర్వాకం గురించి చెప్పడానికి.

హిచ్‌కాక్ తీసిన రెండు గొప్ప సినిమాలు చెప్పమంటే - బ్లాక్ అండ్ వైట్‌లో తొలిరోజుల్లో బ్రిటన్‌లో తీసిన "39 మెట్లు", మలి రోజుల్లో హాలివుడ్‌లో తీసిన "నార్త్ బై నార్త్ వెస్ట్" సినిమాలు. విచిత్రమేమిటంటే - ఈ రెండూ కవలలు. బాణీలో టెక్నిక్‌లో, కథని నడపడంలో, పరుగులో, ఉక్కిరి బిక్కిరి చేసే సన్నివేశాల spot interest లో రెండూ దగ్గరగా కనిపిస్తాయి. అయితే 39 మెట్లు హిచ్‌కాక్ తొలినాటి చిత్రమని గుర్తుంచుకున్నప్పుడు - ఓ గొప్ప కళాకారుడి పరిణితికి ఆ రోజుల్లోనే బీజప్రదానం జరిగిందని గర్వపడాలనిపిస్తుంది.

నిజానికి హీరో హీరోయిన్ల చేతులకి బేడీలు తొడిగిన సన్నివేశం థ్రిల్లర్ సినిమాల ప్రక్రియలోనే ఒక ప్రముఖమయిన ఘట్టంగా ఇప్పటికీ చెప్పుకుంటారు. అలాగే కొన్ని వేల ఎకరాల బయలులో కేరీ గ్రాంట్ (హీరో)ని చంపడానికి చిన్న ఎరువులు జల్లే విమానం వెంటాడే సీను (నార్త్ బై నార్త్ వెస్ట్) అభిమానులకు గుర్తుండే ఉంటుంది. దాని బీజం ఈ సినిమాలో కనిపిస్తుంది.

నిజానికి ఈ సినిమా ఆధారంగా చిరంజీవికి నేనోకథ రాశాను. దాని పేరు "జేబుదొంగ". ఇక్కడొక తమాషా అయిన విషయం చెప్పాలి. ఇలాంటి థ్రిల్లర్‌ని రూపొందించేటప్పుడు ఓ ప్రశ్నని రచయితా, దర్శకుడూ వేసుకుంటారు. చివరలో హీరో ఏం సాధిస్తాడు? అన్నది. కథని బట్టి రకరకాలుగా ఉంటుంది. మెకన్నాస్ గోల్డ్‌లో 'బంగారం' గమ్యం. పాతాళభైరవిలో రాజకుమారిని రక్షించే పనీ - ఇలాగ. ప్రేక్షకులు దానిగురించి ఎక్కువ ఆలోచించరు. దాన్ని సాధించే సాహసమే కథ కనుక. అదొక 'తాయిలం'. ఒక గుర్తు. ఒక సూచిక. ఈ తాయలానికి 'మేక్ గఫిన్' అని సమాధానం. (అందులో బాంబు ఉందా? డైనమైట్ ఉందా? మర్డరయినా ఉందా? అది వేరే విషయం)

'మేక్ గఫిన్ అంటే?'

'అడవిలో సింహాల్ని పట్టుకోవడానికి ఆయుధం'

'ఇక్కడ అడివి లేదే!'

'అయితే మేక్ గఫినూ లేదు!'

ఇదీ జోక్. ఉంటే ఉనట్టు లేకపోతే


సున్నా డిగ్రీల చలిలో ఊలు టోపీతో థియేటర్ ముందు నిలుచున్నది నేనే..!

లేనట్టూ - అది అంత ప్రేక్షకుల్ని ఇబ్బంది పెట్టే విషయం కాదు కనుక. ఓ కథ నడవడానికి, ప్రతీవారూ అదే ముఖ్యమైనదని నమ్మించే - అసలు ఏమీ లేని ఉత్తుత్తి 'తాయిలం'.

"39 మెట్లు" లో హీరో ఎవరినుంచీ తప్పించుకుంటున్నాడు? ఎక్కడికి పరిగెత్తుతున్నాడు? చివరికి ఏం సాధిస్తాడు? లక్ష్యం ఏమిటి? - ఈ ప్రశ్నకు సమాధానమే మేక్ గఫిన్! "నార్త్ బై నార్త్ వెస్ట్"లో హీరో పరారికి ఇదే సమాధానం. దమ్మున్న దర్శకుడు spot interest తో కథని ఊపిరి తిరగకుండా చెప్పగలిగితే ప్రేక్షకులు 'చెప్పడాన్ని' ప్రేమించినంతగా లక్ష్యాన్ని ఎదురుచూడరన్నది హిచ్ కాక్ గట్టి నమ్మకం. ఆయన తన సినిమాల్లో ఆ విషయాన్ని పదే పదే నిరూపించాడు. ఆ టెక్నిక్‌కి దాదాపు ప్రారంభం 39 మెట్లు.




అసలు ఈ 39 మెట్లు ఏమిటి? నవల ప్రకారం ఓ రహస్య ముఠాకి సంకేతం. ఈ ముఠా ఏం చేస్తోంది? ఎందుకు హీరోని వెంబడిస్తోంది? మొదటి రెండు సినిమాలలోనూ ఎవరూ చెప్పలేదు. అసలు ఆ సినిమాలలో మెట్లే లేవు! మూడో సినిమాలో క్లైమాక్సులో ఒక బాంబు పేలితే - మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమవుతున్నది ఒక సాకు - మేక్‌గఫిన్.

ఓ నిరపరాధి, నేలబారు మనిషిని ఓ అందమైన అమ్మాయి పలకరిస్తుంది. తనని ఇంటికి తీసుకెళ్ళమంటుంది హడావిడిగా. ఆ మనిషి షాక్ అవుతాడు. ఎందుకు? వద్దు అనేలోగా అతని భుజం పట్టుకుని అతని ఇంట్లోకి తోసుకు వస్తుంది. ఆమె ఎవరు? అలా రావడానికి కారణం ఏమిటి? అని అడిగేలోగా ఎవరో ఆమెని కాల్చి చంపారు. ఇక హత్యానేరం తన మీద పడకుండా తప్పించుకోవడం, వీలయితే హంతకుడిని పట్టుకోవడానికి ప్రయత్నం నాటకం. హీరో ఎవరి నుంచీ తప్పించుకుంటున్నాడు? ఎవరు హత్య చేశారో కనుక్కుంటాడా? తన ప్రాణాల్ని కాపాడుకుంటాడా? ఈ ప్రశ్నలన్నీ మన మనస్సుల్లో రూపుదిద్దుకోక ముందే ఊపిరి తిరగని సన్నివేశాలు ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ప్రతిసారీ హీరో పోలీసుల్నుంచీ, ముఠానుంచీ తప్పించుకోవడం మనల్ని ఆహ్లాదపరుస్తుంటుంది. చివరికి దుర్మార్గుడు శిక్షింపబడతాడు. అసలు దుర్మార్గం అంటే ఏమిటి? ఈ 71 సంవత్సరాలలో ఆ ప్రశ్న ఈ మూడు సినిమాలు చూసిన ఎవరికీ రాలేదు! సెకనుకి 24 ఫ్రేములు కదిలే సినిమా వేగం ప్రేక్షకుల్ని జోకొట్టి, మోసం చేస్తుంది. ప్రేక్షకుడు ఆనందంగా మోసపోతాడు - నాటకాన్ని చూస్తూ. ఈ మోసాన్ని అద్భుతమయిన 'కళ'ని చేసిన దర్శకుడి కళాఖండం 39 మెట్లు. మేజిక్కుని చూస్తో



లాజిక్కుకి ఆనందంగా విడాకులిచ్చేప్రక్రియని ప్రేక్షకులకి అలవాటు చేసిన ఘనత ఈ నాటకానిది - అంటే హిచ్‌కాక్‌ది - పరోక్షంగా.

చావుకి భయపడక, ధైర్యంగా అడ్డంకుల్ని అధిగమిస్తూ, మొండిగా, సాహసంతో దూసుకుపోయిన ఈ హీరో ‘రిచర్డ్ హనీ‘ బ్రిటిష్ సాహిత్యంలో, సినిమాల్లో ఒక బాణీకి మూలపురుషుడయాడు. ‘హనీ ధోరణి‘ అని స్థిరపడిపోయింది. ఈ ధోరణిలో చిత్రితమయిన ఓ గొప్ప పాత్ర (అలెక్ లీమాస్) ని "ది స్పై హూ కేమ్ ఫ్రం ది కోల్డ్" (1965)లో ప్రముఖ నటుడు రిచర్డ్ బర్టన్ చేశారు.

హనీ గురించి చాలా చక్కగా కరపత్రంలో వ్రాశారు ప్రదర్శకులు He is the perpetual winner par excellence and in an increasingly complex world his simple morality remains our anchor and our rock, the still reliable centre of a relentlessly changing universe…. And that’s probably why the majority of you are here in the audience tonight.”

సరే. సినిమాలో చూపించే పరుగులూ, వంతెనల మీద నుంచీ గెంతడాలూ, రకరకాల స్థలాల నుంచీ తప్పుకోవడాలూ, హోటల్ గదులులో సన్నివేశాలూ - అంతే వాస్తవంగా, అంతే చురుకుగా - అంతకు మించి అంతే వేగంతో స్టేజి మీదకి ఎలా తీసుకురావడం? "మిస్ సైగాన్" నాటకంలో స్టేజి మీదకి హెలికాప్టర్‌ని తీసుకొచ్చారు. "ది టైటానిక్" నాటకంలో ఓడని చూపారు. ఇది ఒక ఎత్తు. ఒక థ్రిలర్‌గా సాగే ఈ ఇతి వృత్తాన్ని - ఆద్యంతమూ హాస్యరస భరితమయిన ప్రదర్శనగా మలచడం ఎలా? ఆ ఒక్క కారణానికే ఈ నాటకం ‘ది థర్టీ నైన్ స్టెప్స్‘ చూడాలి.

ఇందులో పోలీసులున్నారు. ముఠా మనుషులున్నారు. రైతులున్నారు, హోటల్ సిబ్బంది ఉన్నారు, రైతు భార్య ఉంది - ఇలా 139 మంది ఉన్నారు. కేవలం నలుగురే నటులు ఆద్యంతమూ మీసాలు మార్చి, మేకప్పులు మార్చి, దుస్తులు మార్చి, నటనని మార్చి మేనరిజాలు కొత్తవి ఏర్పరుచుకుని - క్షణం ఊపిరి తిరగనివ్వకుండా రెండు గంటలసేపు ఒక ‘సాహస గాథ‘ని హాస్య స్ఫోరకంగా రంగస్థలం మీద ప్రదర్శించారు. ఇది ఒక అద్భుతం. గార్డియన్ పత్రిక మాటల్లో చెప్పాలంటే “clever, very funny, imaginative and brilliantly enacted”

నాటకం అసాంతం mime, pantomime, improvisation, shadow play - మీ ఇష్టం అన్నీ ఉపయోగించారు. నాటకంలో విమానం చూపడానికి సరాసరి విమానాన్ని దింపడం అద్భుతం. కానీ విమానాన్ని సూచించడం కళ. అదీ నాటకీయత.


సగం ఖరీదు టిక్కెట్లు అమ్మే చోట నేను

పోరాటాలూ, వెంటాడడాలూ, దాగుడు మూతులూ - ఆ వేగమంతా సెకన్లు నష్టపోకుండా రెండు గంటల సేపు ఉక్కిరి బిక్కిరి చేస్తుంది నాటకం. యధాతథంగా చూపడం కాక సూచనని అందుకని దాన్ని ఆలోచనగా తన అనుభవంలోకి తర్జుమా చేసుకున్నందుకే మురిసిపోతాడు ప్రేక్షకుడుThe audience’s inerest is directly proportional to what is left unsaid and ambiguously hinted.

ఒక సన్నివేశంలో కుడి సైడ్ కర్టెన్ దగ్గర ద్వారం చట్రం తలుపు ఉంది. హీరో తలుపు కొట్టాడు. ఇటునుంచీ ఓ ముసలావిడ (నటులలో ఒకరే!) తలుపు తీసింది. హీరో లోపలికి వచ్చాడు. వెంటనే చట్రాన్ని entre back stage కి మార్చారు. ఇప్పుడు స్టేజి అంతా హీరో వచ్చిన గది అయిపోయింది! ఇలాంటి improvisations నాటకమంతా కోకొల్లలు.

ముఖ్యంగా సైమన్‌గ్రిగోర్ అనే సహనటుని నటన అపూర్వం. అతను చేసిన వివిధ పాత్రలకి ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. నాటక మంతా అయేసరికి - ఎంత విస్తృతమయిన పరిధిలో ఉన్న నాటకాన్ని ఎంత అలవోకగా రంగస్థల మీద కుదించి ఒప్పించారా అని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది ప్రదర్శన.

లబ్ధప్రతిష్ఠులయిన నటీనటులు, సాంకేతిక బృందం ఈ నాటక ప్రదర్శనకి వెన్నెముక. ప్రతి నటునికీ, నటికీ ఒక చరిత్ర ఉంది. వారంతా అంతో ఇంతో సినిమాలలో నటించినవారు. దర్శకత్వం మేరియా ఆట్‌కిన్ అనే ఆవిడ నిర్వహించారు. దర్శకులు అప్పుడప్పుడు మారుతూ తమ ప్రతిభని రంగరిస్తుంటారు. ఈ నాటకానికి తొలుత దర్శకత్వం వహించినది ఫియోనా బఫ్ఫినీ అనే మరో మహిళ. ఈ నాటకాన్ని ప్రదర్శించిన ట్రైసికిల్ అనే నాటక సంస్థ ఇప్పటికీ ప్రపంచమంతటా 25 లక్షల మంది సమక్షంలో ప్రదర్శనలు జరిపిందట.

సెంట్రల్ లండన్‌లో అండర్ గ్రౌండ్ స్టేషన్‌లోంచి బయటికి రాగానే - ఎదురుగా కనిపిస్తుంది - క్రైటీరియన్ అనే థియేటర్. సంప్రదాయాన్నీ, చరిత్రనీ భద్రంగా కాపాడుకునే బ్రిటిష్ వారసత్వానికి మచ్చుతునకలు - వెస్టెండులో ఈ నాటకశాలలు. 1870 ప్రాంతంలో ఇక్కడ ఒక సత్రం ఉండేది. ప్రస్తుతం రిజెంట్ సర్కస్ (జెర్మిన్ వీధి, పికడిల్లీ సర్కస్ మధ్య) ఉండే స్థలం పెద్ద పల్లపు భూభాగం. అక్కడ పెద్ద క్రైటీరియన్ రెస్టారెంట్, డైనింగ్ గదులు, మీద ఒక బాల్‌రూం నిర్మించారు. మరి ప్రత్యేకంగా పంపే ఏర్పాట్లు చేశారు. అంటే - ఆ రోజుల్లోనే - దాదాపు 130 సంవత్సరాల కిందట ఇక్కడ ఒక ఎయిర్ కండిషన్డ్ హాలు ఏర్పాటు అయింది.

దరిమిలాను - ఇది నాటక శాల అయింది. ప్రముఖ నటులు జాన్ గిల్‌గుడ్ చాలా నాటకాల్ని ఇక్కడ ప్రదర్శించారు. టెరన్స్ రాటిగన్ అనే బ్రిటిష్ రచయితకి ఇక్కడి ప్రదర్శన "ఫ్రెంచి వితవుట్ టియర్స్"తోనే మంచి పేరొచ్చింది.

రెండో ప్రపంచయుద్ధం రోజుల్లో బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పోరేషన్ (బిబిసి) ఇక్కడినుంచే ప్రసారాలను నిర్వహించింది. బేస్‌మెంటులో ఉండడం వల్ల రక్షణకూ, ప్రసారాలకూ ఇబ్బంది కలగలేదు. 1996 నుంచీ మొన్నటివరకు ఇక్కడ వరసగా షేక్స్పియర్ నాటకాలను ప్రదర్శించేవారు.

ఈ నాటకశాల వల్ల మరొక సుఖం ఉంది. నాటకం పూర్తయ్యేసరికి తేలికగా పదిన్నర అవుతుంది. చలికాలంలో చలి భయంకరమయిన స్థాయికి వచ్చే సమయం అది. నాటకశాల నుంచీ బయటికి వస్తూనే ప్రేక్షకులు - చాలా వరకు - రోడ్డు దాటి పిక డిల్లీ అండర్ గ్రౌండు స్టేషన్ వేపు దూకుతారు.

ఓ నవలా రచయిత రచననీ, ఓ మహా దర్శకుని ప్రతిభనీ 90 సంవత్సరాల తర్వాత (నవల రచనాకాలం 1914) కూడా అజరామరం చేసుకున్న ఓ గొప్ప నాటక రంగపు ఉజ్జ్వలమయిన చరిత్ర ఇది.

అన్నట్టు - ఈ నాటకం టిక్కెట్టు కేవలం 1200 రూపాయలు. ఆ రోజునే కొనేవారికి ఓ సౌకర్యం ఉంది. ప్రతి రోజూ లెస్టర్ స్క్వేర్‌లో ‘సగంధర టిక్కెట్ల బూత్‘ దగ్గర ఆయా నాటకాల టిక్కెట్లు - సగం ధరకి దొరుకుతాయి. ఆ లెక్కన నేను కొన్న టిక్కెట్టు అసలు ధర 2,400 రూపాయలు!

నాటకం టిక్కెట్టు




✡✡✡